కథా నిలయం
శ్రీకాకుళం

# కోవెల

ఎలాగైనా సరే గుడి కట్టించాలనే ఆలోచన సుందరం మనసులోంచి తొలగించాలని గట్టిగా నిర్ణయించుకున్నాను. ఆ పనిమీదనే ఆదివారం ఉదయాన్నే వాళ్ల ఇంటికి ప్రయాణమవుతుండగా "మనం ఎటూ చేయలేం, చేసే ఆయన్నికూడా అడ్డుకోవటం ఎందుకండీ... మరోసారి ఆలోచించుకోండి" అనేసింది శ్రీమతి.

"ఉపయోగకరమైన మరోటి ఏదైనా చేయమని చెప్తున్నాగా పార్వతీ"

"బావులు తవ్వించటం, చెట్లు నాటించటం, సత్రాలు కట్టించటం... ఆలయాలు నిర్మించటం.... ఇవన్నీ పుణ్యకార్యాలు కాదేంటండీ....

డబ్బున్న మారాజు.. ఆయనకేదో ఓ మంచి సంకల్పం కలిగింది. చేయనీయండి...వద్దంటూ వారించటం ఎందుకూ" ఆఖరి ప్రయత్నంగా నా మనసు మార్చటానికి తహతహలాడుతున్న అర్ధాంగి పట్ల జాలిగా చూశాను. చెప్పులు తొడుక్కుని బయటకు నడిచాను.

* * * *

నేనూ, సుందరం చిన్నతనం నుంచీ చాలా స్నేహంగా వుండేవాళ్లం. చదువులోనూ, ఆటపాటల్లోనూ అన్నిట్లో ఇద్దరం సమఉజ్జీగా ఉండేవాళ్లం. ఎలిమెంటరీ స్కూలు స్థాయి నుంచి కాలేజీ వరకూ కలిసే చదువుకున్నాం. డిగ్రీలు సంపాదించాం.

సుందరానికి చదువుతోపాటు ఆస్తివుంది. నాకు మాత్రం చదువు ఒక్కటే ఆస్తి. అతనికి ఉద్యోగం చేయవలసిన అవసరంలేదు. చదువు అబ్బక పోయినా, ఆగిపోయినా ఏదో ఒక నౌకరీ చేయవలసిన అవసరం నాది. అందుకే డిగ్రీ పూర్తికాగానే దినపత్రికల్లో కనిపించిన ప్రకటనల్లో చాలావాటికి అప్లికేషన్ పెట్టుకున్నాను.

ఇప్పటిలా అదృష్టాన్నిబట్టి కాకుండా, అర్హతని బట్టి ఉద్యోగాలు వచ్చే రోజులు కాబట్టి, జనాన్ని ఎన్నెన్నో వర్గాలుగా విభజింపని రోజులు కాబట్టి అప్లికేషన్ పంపిన ఆరువారాల్లో ఓ ప్రభుత్వోద్యోగిని కాగలిగాను. నా కోరిక అంత త్వరగా తీరినందుకు ఎంతగానో సంతోషపడ్డాడు సుందరం. కుటుంబ సమేతంగా ఆ ఊరువదలి వెళ్లాన్నేను. అప్పట్నుంచి ఎక్కడికెక్కడికో బదిలీలు, ఎన్నెన్నో మజిలీలు. అయినా సర్వీసులో ఉండగానే నేను పుట్టిపెరిగిన ఊళ్లోనే ఉన్న నా స్వంత ఇంటికి మెరుగులు దిద్దుకోగలిగేను.

అవకాశం దొరికినప్పుడూ, అవసరమైనప్పుడూ సుందరాన్ని కలుస్తూనే ఉన్నాను. మా ఇద్దరి పెళ్ళిళ్లూ కూడా కుడి ఎడంగా ఒకే సమయంలో జరిగినై. కాలక్షేపం కోసం ప్రారంభించిన వ్యాపారం అనతి కాలంలోనే అభివృద్ధి చెంది అక్కర్లేనంత ధనం సంపాదించాడు సుందరం.

సంపాదించిన దాన్తోనే తృప్తిపడి, పిల్లలందరికీ చదువులు చెప్పించి వాళ్లకోమార్గం దొరికాక, ఆఖరి మజిలీగా మళ్లీ అదే వూరు చేరేను. సుందరం స్నేహం నాకు కొండంత అండ. మా ఇద్దరి అదృష్టం అనుకుంటాను ఆడవారి ఇద్దరి మధ్యా కూడా ఆత్మీయత చోటుచేసుకున్నది. మనసువిప్పి మాట్లాడుకునేపాటి అనుబంధం ఏర్పడింది వాళ్ళమధ్యకూడా.

సుందరం, పిల్లల్నికూడా వ్యాపారంలోనే ప్రవేశపెట్టాడు. ఏ గూటి పక్షులు ఆపాటే పాడతాయని ఊరకనే అన్నారా! మాకున్న ఒక్కగానొక్కకొడుకు ఓ ప్రభుత్వ రంగ సంస్థలో మంచి ఉద్యోగమే చేస్తున్నాడు. కూతురికి పెళ్లిచేయడంతో ఒకరకంగా బాధ్యతలు తీరిపోయినట్లే అనుకుంటాను.

"ఆ నా ఆలోచన నాకే నవ్వు తెప్పిస్తుంటుంది. బాధ్యతలు తీరిపోవటం ఏమిటి అనిపిస్తుంటుంది. అవున్నిజమే. బాధ్యతల్లేకుండా బ్రతకడం ఎలా? కొడుకు ఉద్యోగం, కూతురికి పెళ్లి ఈ రెండే నా బాధ్యతలు? జీవితాంతం మనిషిగా బతకటం మన బాధ్యత కదూ?

అసలు నన్నడిగితే ఎవరైనా సరే బ్రతక్కూడదు... జీవించాలి. చనిపోయాక కూడా జీవించలేకపోవచ్చు అందరూ.కానీ చస్తూ మాత్రం బ్రతక్కూడదు. చచ్చినట్లు బ్రతక్కూడదు.

మన జీవితంలో జీవం ఉండాలి. అందుకే జీవించాలి. అదీ మనిషిలా అక్కర్లేకపోవచ్చు. అందుకే బాధ్యతనేది తీరేదికాదు... కాదుకాదు తీరకూడదు. చనిపోయేవరకూ బాధ్యతగానే జీవించాలేమో అనిపిస్తుంటుంది నాకు.

ఆలోచనల మధ్యనే సుందరం ఇంటికి చేరాను. నేను వెళ్లేసరికి అయిదారుగురు సుందరంతో మాట్లాడుతూ కూర్చున్నారు.

"నేనే నీకు కబురు పంపాలనుకుంటున్నాను. సరిగ్గా సమయానికి వచ్చావ్. రారా... రా" నవ్వుతూ, ఆప్యాయంగా అన్నాడు సుందరం.

అక్కడ ఉన్న అందరి మధ్యనా ఖాళీగా ఉన్న కుర్చీలో కూర్చున్నాను.

"ఇవిగో ఈ కాగితాలు చూడు" అంటూ మడచివున్న దొంతర నా చేతికి అందించాడు సుందరం.

"చూడటానికి ఏముంది. దస్తావేజులేగా... హద్దులు, వాటి యజమానుల వివరాలు, కొలతలు, హక్కులు, వినిమయ, విక్రయాది హక్కుల్తో అందుగల జల, తరు, పాషాణాది... అన్ని దస్తావేజుల్లో వుండే భాషేగా" అని నవ్వాను.

నా నవ్వుకు అక్కడున్న వారంతా వంతపాడారు. గుడి కట్టించేందుకు స్థలం కొనబోతున్నాడు సుందరం. స్థలం కొనటం వరకూ నాకు ఎటువంటి అభ్యంతరం లేదు కాబట్టి మిన్నకుండిపోయాను.

మరో నాలుగు రోజుల్లో స్థలం రిజిస్ట్రేషన్ వ్యవహారం పూర్తయిపోయింది.

* * * *

"గుడి కట్టించడం ప్రస్తుతానికి అనవసరంరా సుందరం... నా మాట విను" నా ప్రయత్నాన్ని పునఃప్రారంభించాను.

"నీకు తెలీదులే... ఈ విషయంలో మాత్రం నాకు అడ్డు చెప్పకు" అన్నాడు సుందరం.

"శిధిలావస్థకు చేరి, వెలవెల పోతున్న కోవెలలు ఎన్నిలేవు వాటిల్లో కొన్నింటిని, కాదంటే కనీసం ఒక్కదాన్ని బాగుచేయరా. ఆ గుడికి పూర్వ వైభవాన్ని తీసుకురా. రెండుపూటలా పూజాదికాలు జరిగేటట్లు చేసి ఆ కోవెల్లో దీపం పెట్టే ఏర్పాటు చెయ్యి... నువ్వు గుడి కట్టించినదానికంటే రెట్టింపు ప్రయోజనం ఉంటుంది" అన్నాను.

"మన ఊర్లో ఆసుపత్రి కట్టించాను. పక్కవూళ్లో పిల్లలకోసం ఓ బడి కట్టించాను. ఇక ఈ గుడికూడా కట్టించాననుకో..."

వాడి మాటలు పూర్తికానీయకుండానే.

"సుందరంగారి ఆసుపత్రి, సుందరయ్యగారి పాఠశాల అన్నట్లుగా సుందరయ్యగారి గుడి అని పిల్చుకుంటారు. అంతేగానీ నువ్వు కట్టించబోయే ఆంజనేయస్వామిగుడో, అయ్యప్పస్వామిగుడో అని ఎవ్వరూ అనుకోరేమో, ఆలోచించు"

"అనుకోవాలనేగదా... ఏం...హైదరాబాదులో ఉన్న వెంకటేశ్వరస్వామి గుడికి ఎవరైనా ఏడుకొండల వాడి ఆలయం అంటున్నారా... బిర్లామందిర్ అని కదూ అంటారు. అలాగే ఇదీనూ.. అందులో తప్పేముందీ?" అన్నాడు సుందరం.

"వైద్యశాలలు కట్టించినా, పాఠశాలలు కట్టించినా దానికో అర్థం, పరమార్థం ఉంటాయి. దేవాలయాలు ఎందుకురా ఉన్నవి చాలకనా..."

"వీధికో గుడి, సందుకో ఆలయం, కులాల వారిగా గుడులు, వాటికో ప్రాధాన్యత కల్పించటం, ప్రచారాలు చేసుకోవటం... ఎందుకు? ఏ దేవుడు సంతోషిస్తాడని..." ఆవేశంగానే అన్నాను.

ఎన్నంటే ఏం ప్రయోజనం? నా మాటలన్నీ నీటి మూటలే అయినై. చెవిటివాడిముందు శంఖం ఊదాను. ఆలయనిర్మాణానికి అన్ని ఏర్పాట్లు చకచకా సాగిపోసాగినై. ఇటుక, ఇసుక, కంకర, ఇనుము, సిమెంటు ఒక్కొక్కటి తరలిరాసాగింది. ఉడతాభక్తిగా ఊళ్లో వాళ్లు తమకు తోచిన రీతిలో ఆ నిర్మాణంలో పాలుపంచుకుంటున్నారు.

రెట్టించిన ఉత్సాహంతో ఆ కార్యక్రమంలో మునిగి తేలుతున్నాడు సుందరం. విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎవరో స్వామీజీని కూడా ఒప్పించేశాడని విన్నాను. మార్బుల్ స్టోన్స్‌తో, మొజాయిక్ ఫ్లోరింగ్‌తో, ఫ్లొరిసెంట్ దీపాలతో ధగధగాయమానంగా, తళతళలాడిపోతూ కనువిందుగా, కమనీయంగా రూపుదిద్దుకున్నది ఆలయ నిర్మాణం. అర్చక స్వాములు కూడా నిర్ణయింపబడ్డారు.

ఊరు ఊరంతా ఆ గుడి నిర్మాణాన్ని గురించే రకరకాలుగా చెప్పుకోసాగారు. మా చిన్నతనం నుంచీ ఉన్న శివాలయం, రామమందిరం మాత్రం ఊడిపోయిన పెచ్చుల్తో రాలిపోతున్న కప్పుల్తో, వెలసిపోయిన రంగుల్తో, ప్రాంగణమంతా పిచ్చి మొక్కల్తో పాతబడిపోయివున్నయ్.

వాటిల్లో ఒకప్పుడు జరిగిన ఉత్సవాలు ఇప్పుడు లేవు. ప్రసాదాల పంపిణీలు లేవు.

దీపారాధన చేసేందుకు చమురు కావాలి. ఆ చమురుకొనేందు క్కూడా 'చమురు'లేని స్థితిలో ఉన్నయ్ ఆ రెండు దేవాలయాలు.

కొత్తొక వింత, పాత ఒకరోత... నిజమే.. కానీ దేవుడిక్కూడానా! ఎందుకో ఈ పరిణామాన్ని నేను జీర్ణించుకోలేకపోయాను.

"ఏమండీ... చూశారా సుందరంగారు ఎంత సుందరంగా కోవెల కట్టించారో. పూజ చేయించదలచుకున్నవాళ్లు ఇంటి నుంచి ఏమీ తీసుకువెళ్లక్కర్లేదుట. పసుపు కుంకుమల దగ్గర్నుంచి, పళ్లు, పూలు, అగరువత్తులు అన్నీ వాళ్లే సమకూరుస్తారట. మనం యాభై రూపాయలు ఇస్తేచాలు. కార్తీక మాసంలో రోజూ అభిషేకం చేయించాలనుకుంటే నెలకంతకూ నూరు రూపాయలేనట. ధనుర్మాసంలో ప్రసాదం చేయించాలనుకుంటే కూడా వంద రూపాయిలేనటండీ. బాగున్నైకదూ ఏర్పాట్లు"

* * * *

"అబ్బ... గుడి కూడా ఎంత బాగుందో! అక్కడ కాసేపు కూర్చుంటే వదిలిపెట్టి రాబుద్ధే కాలేదు. ముందంతా పూలమొక్కలు, మధ్యలో నీళ్లు చిమ్ముతూ ఫౌంటేను.. ఎంత అందంగా ఉందో! ఆఫీసురూముట. దాన్లోంచి చిన్నగా, సన్నగా అన్నమాచార్య కీర్తనలు వినపడుతున్నై. ఎంత హాయిగా ఉందో? మీరు ఓ సారి వెళ్లిరండీ"

"గుడికి వెళ్లి అక్కడి అందాన్ని, ఆర్భాటాన్ని చూసి పులకించిపోయే భక్తి నాకులేదు పార్వతీ. అక్కడచేతులు కడుక్కోవటానికి ఏర్పాటుచేసిన కొత్తకుళాయిల్ని చూసి మురిసిపోవటానికి, కొబ్బరి కాయలు కొట్టేందుకు నియమించిన నౌకర్ని చూసి అచ్చెరువొందటానికి, చాలినంత భక్తినాకు లేదు పార్వతి" అన్నాను ఆవేదనగా.

"మీదంతా చోద్యం.." అంటూ మూతి మూడు వంకర్లు తిప్పిందామె.

"అందరూ అన్ని రకాలుగా మెచ్చుకుంటుంటే, నువ్వెందుకురా అలా నొచ్చుకుంటావ్ నే చేసిన పనికి" నిష్టూరంగా అడిగేడు సుందరం.

* * * *

"నీ మాట కాదన్నాననేగా నీకు అంత కోపం" అడిగేడు మళ్లా.

'నామాటే వినాలనిగానీ, నే చెప్పినట్లే నువ్వు చెయ్యాలనీ నేనెన్నడూ అనుకోలేదు. అనుకోను కూడా. నా బాధంతా ఒకటే. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులంటూ అమాయకుల్నిచేసి జనాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారు. రెసిడెన్షియల్ కాలేజీలంటూ ఆధునాతన సౌకర్యాల్తో పిల్లల్నీ ప్రలోభపెడుతున్నారు. హైటెక్ బస్సులంటూ దోస్తున్నారు. ఇవన్నీ చాలకనా! ఈ సూపర్ స్పెషాలిటీ కల్చరు దేవుళ్ల క్కూడా ఆపాదించి ఆలయాలు నిర్మించటం"

* * * *

"పోనీలే... సంపాదించేవాడే సమర్థుడు, మోసం చేయగలిగినవాడే మొనగాడు, దేవుడికి నమస్కారం చేసుకోవటానిక్కూడా బంట్రోతును పెట్టుకున్నవాడే భక్తుడు... నేను భక్తుడ్ని కాకపోయినా నీకోసం... కాదు... నీ స్నేహంకోసం తప్పకుండా త్వరలో నీ కొత్తకోవెల చూస్తాన్లే" అన్నాను.

"చూశాక నీ అభిప్రాయం మారుతుందిలే" అంటూ వెళ్ళిపోయాడు సుందరం.

చిద్విలాసంగా నవ్వుతూన్నట్లనిపించిన సర్వసాక్షికి స్వయంగా నమస్కారం చేసుకున్నాను.

◆ స్వాతి - ఏప్రిల్, 2000 ◆

* * * *